

టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.32 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
33.5°/20.7°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: గణేశ్ ఉత్సవాల వేళ జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. ఈమేరకు గురువారం గణేష్ ఉత్సవాల మండలపాల ఏర్పాటు, అనుమతులపై విధివిధానాలను ఎస్పీ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. మండలపాల ఏర్పాటుకు అనుమతులు సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానంతో పోర్టల్ రూపొందించిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ సేవ ద్వారా చలానా చెల్లించి ఎన్‌ఓసీ పొందాలన్నారు. అనుమతులు పొంది క్యూఆర్ కోడ్‌ను ఉత్సవాలు నిర్వహించే పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలన్నారు. ముందుగా అనుమతి పొందేవారు https://ganeshutsqv.net ద్వారా లాగిన్ అయి దరఖాస్తు పూర్తి చేస్తే అనుమతులు మంజూరు చేస్తారని వివరించారు. గణేశ్ మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112కు డయల్ చేయాలన్నారు.

సర్టిఫికెట్లతో రేపు హాజరుకండి

పుట్టపర్తి టౌన్: సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన జిల్లా వాసులు ఈనెల 23న గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు అప్లికేషన్‌తో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

సెక్టోరియల్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

- సిఫారసులకే పెద్ద పీట ?



మెరిట్ లిస్టు బహిర్గతం చేయాలని స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి: జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గురువారం బుక్కపట్నం డైట్ కళాశాలలో సెక్టోరియల్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆర్డీఓ సువర్ణ, డీఈఓ క్రిష్ణప్ప, సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ దేవరాజ్ పాల్గొన్నారు. మొత్తం 9 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే మెరిట్ లిస్టును పక్కనపెట్టి రాజకీయ నేతలు చెప్పిన వారికే అవకాశం ఇస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇదిలా ఉంటే మెరిట్ జాబితా ప్రకటించకుండా ఇంటర్వ్యూలు ఎలా చేపడతారని యూటీఎఫ్ నేతలు ప్రశ్నించారు. ఈ మేరకు కలెక్టర్‌కు రాసిన లేఖను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డికి సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ 120 మంది దరఖాస్తు చేసుకోగా, 85 మార్కులను అర్హతగా నిర్ణయించారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఎవరికెన్ని మార్కులు వచ్చాయో చెప్పాలని, లేకపోతే ఇంటర్వ్యూలు రద్దు చేయాలన్నారు.

ఎన్‌టీఆర్ 'వసూళ్ల' సేవ!

- వైద్యసేవల్లో సరికొత్త దందా
- ఉచితం మాటున ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ
- అనుమతులు వచ్చేలోపే జేబులు గుల్ల చేస్తున్న వైనం
- కూటమి ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వైద్యం

☛ సోమందేపల్లికి చెందిన 54 ఏళ్ల వ్యక్తి గుండె సమస్యతో హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. అక్కడ సిబ్బంది పక్కనే ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని.. అక్కడ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఉచితంగా వైద్యం చేస్తారని సూచించారు. అక్కడికి వెళ్లగా.. టోకెన్ ఫీజు తీసుకుని.. బెడ్ ఇచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం ఎన్టీఆర్ వైద్య సేవ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అప్రూవల్ మెసేజీ వచ్చే లోపు రూ.20 వేలు తీసుకున్నారు. పూర్తిగా ఉచితం కదా అని ప్రశ్నిస్తే.. అనుమతులు రాక ముందే చార్జీలు అంటూ సమాధానం చెప్పారు. అంతేకాకుండా ఆపరేషన్ చేసే సమయంలో పేషెంట్ కండిషన్ బాగా లేకుంటే బెంగళూరు వెళ్లాలని భయపెట్టారు. ఒకవేళ దూరం వెళ్లలేకుంటే మరో రూ.30 వేలు అదనంగా చెల్లిస్తే.. స్పెషలిస్టును పిలిపిస్తామని వసూలు చేసినట్లు బాధితులు వాపోయారు.

☛ ఓడీ చెరువుకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి కదిరి రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. వెంటనే ప్రథమ చికిత్స చేసి రూ.10 వేలు కట్టించుకున్నారు. 'ఎన్టీఆర్ వైద్య సేవ' గురించి అడిగితే.. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత వర్తిస్తుందని చెప్పారు. ఆ తర్వాత రెండు రోజుల వరకు మెడిసిన్, బెడ్ ఫీజు చెల్లించారు. ఆ తర్వాత ఎన్టీఆర్ వైద్య సేవ పథకం వర్తిస్తుందని మెసేజీ వచ్చిన తర్వాత ఆపరేషన్ చేస్తామని చెప్పారు. కొన్ని గంటల ముందుగా రోగి కుటుంబ సభ్యులతో డాక్టర్లు మాట్లాడి.. ప్రభుత్వం ఇచ్చే మొత్తం సరిపోదని.. ఇంకొంత చెల్లిస్తే ఆపరేషన్ చేస్తామని.. లేదంటే వేరే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో అదనంగా మరో రూ.15 వేలు చెల్లించినట్లు బాధితులు వాపోయారు.

... చాలా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ విధంగానే దందా చేస్తున్నారు. అయితే పట్టించుకోవాల్సిన అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు.



సాక్షి, పుట్టపర్తి : పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిన 'ఎన్‌టీఆర్ వైద్య సేవ' పథకంలోని కొన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు అడ్డగోలు వ్యవహారానికి తెర తీశాయి. రోగుల భయాన్ని, ఆరోగ్య సమస్యలను ఆసరాగా చేసుకుని అందినకాడికి దోచుకుంటున్నాయి. ప్రభుత్వం అందించే నిధులు ఏ మూలకూ సరిపోవంటూ నమ్మబలికి కో–పేమెంట్లతో దండుకుంటున్నారు. మల్టీ స్పెషాలిటీ సేవలతో పాటు ఆర్థో, యూరో, కార్డియాక్ చికిత్స చేసే ఆస్పత్రుల్లో ఇలాంటి వ్యవహారాలు బయట పడుతున్నాయి.

భయపెట్టి వసూళ్లు..

అదనపు వసూళ్ల విషయంలో బయటకు చెబితే.. మెరుగైన వైద్యం అందించరేమోననే భయంతో రోగులు మిన్నకుండిపోతున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిపోయింది. కంటి, న్యూరో, ఆర్థో, యూరాలజీ, కార్డియాక్.. ఇలా ఏ శస్త్రచికిత్స అయినా.. స్థాయిని బట్టి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా మరింత డిమాండ్ చేస్తున్నారు. దీంతో అప్పటికప్పుడు అప్పు తెచ్చి మరీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వసూలు చేస్తున్నారు ఇలా..

ఎన్టీఆర్ వైద్యసేవలో ఓ వ్యక్తి సింగిల్ స్టంట్ వేయించుకోవాలంటే రూ.60 వేలు, డబుల్ స్టంట్‌కు అయితే రూ.90 వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుంది. రోగి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సేవలు అందుబాటులోకి వస్తాయి. కొందరు తెలియక.. నేరుగా ఆస్పత్రికి వెళ్తుండటంతో.. టోకెన్ ఫీజుతో పాటు బెడ్ చార్జీలు, ముందస్తు మెడిసిన్ పేరుతో రూ.వేలల్లో దండుకుంటున్నారు. ఇంకా అప్రూవల్ మెసేజీ రాలేదంటే నాలుగైదు రోజులు గడిపేసి భారీగా లాగేసి ఆ తర్వాత ఆపరేషన్ కోసం మరోసారి ఒప్పందం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవలు అందుబాటులో ఉండే ఆస్పత్రులు 11 (హిందూపురంలో 5, కదిరిలో 4, ధర్మవరంలో 2) ఉన్నాయి. వీటిలో చాలా చోట్ల అదనంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఒకవేళ ప్రభుత్వాస్పత్రికి వెళ్లినా.. ఆయా ఆస్పత్రులకు వెళ్లాలని కొందరు సూచించి అదనపు వసూలులో పర్సెంటేజీలు తీసుకున్నట్లు సమాచారం. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రమైంది.

అమలు అస్తవ్యస్తం..

ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అమలు అస్తవ్యస్తంగా ఉంది. వైద్యసేవలు అందుబాటులో ఉంటున్న ఆస్పత్రుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఆరోగ్య మిత్రలు అందుబాటులో ఉంటున్నారు. దీంతో ఆ తర్వాత చేరిన రోగులు టోకెన్ తీసుకుని.. మరుసటి రోజు వరకు ఫీజులు చెల్లించి.. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన పరిస్థితి.

ఫిర్యాదు చేయండి



'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం వర్తించిన వారికి వైద్యం, మందులు ఉచితం. ఎలాంటి చెల్లింపులు అవసరం లేదు. ఏదైనా ఆస్పత్రిలో అదనంగా డబ్బులు వసూలు చేసినా.. డిమాండ్ చేసినా వెంటనే మాకు ఫిర్యాదు చేయండి. విచారణ చేసి చర్యలకు ఆదేశిస్తాం.

– కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్

పింఛన్ తొలగించారని దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న దివ్యాంగుడు నాగార్జున

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల పంచాయతీ పల్లోల్లపల్లికి చెందిన దివ్యాంగుడు నాగార్జున గురువారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాల్లోకెళితే.. నాగార్జున రెండేళ్లుగా దివ్యాంగ పింఛన్ అందుకుంటున్నారు. అయితే రీవెరిఫికేషన్‌లో తన పింఛన్‌ను తొలగించడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న కుమారుడిని చూసి తండ్రి శ్రీరాములు వెంటనే కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించండి

ప్రశాంతి నిలయం: ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలనికలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల అధికారులతో కలసి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ జిల్లాలో బూత్ స్థాయి ఏజెంట్లను గుర్తించాలని, ఓటరు జాబితాలో తప్పులు గుర్తించి ఉంటే సదరు జాబితాను వచ్చే సమావేశంలో సమర్పించాలన్నారు.

పట్నం పూర్వపు ఎస్‌ఐ రాజశేఖర్‌పై కేసు నమోదు

గుత్తి: న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన గిరిజన మహిళను లైంగికంగా వేధించి ఉద్యోగం పోగొట్టుకున్న ముదిగుబ్బ మండలం 'పట్నం' పూర్వపు ఎస్‌ఐ రాజశేఖర్‌పై గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన ఓ మహిళ ఎస్‌ఐ రాజశేఖర్‌పై ఫిర్యాదు చేయగా.. సీఐ వెంకటేశ్వర్లు సమగ్రంగా విచారించి రాజశేఖర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, లైగింక వేధింపులతో పాటు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. కాగా, సమస్య పరిష్కారం కోసం పట్నం పోలీసు స్టేషన్‌కు వచ్చిన గిరిజన మహిళను ఎస్‌ఐ హోదాలో ఉన్న రాజశేఖర్ లైంగికంగా వేధించిన వైనంపై 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందించిన ఎస్పీ రత్న తొలుత రాజశేఖర్‌ను వీఆర్‌కు పంపారు. అనంతరం విచారణ జరిపారు. రాజశేఖర్ లైంగిక వేధింపులు నిజమని తేలడంతో అతన్ని ఉద్యోగం నుంచి తొలగిస్తూ రాయలసీమ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా లైంగిక వేధింపులపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

'కప్పలబండ'లో రూ.కోటి గోల్‌మాల్

- సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసిన అధికారులు
- మంత్రి లోకేష్, స్థానిక ఎమ్మెల్యే కుటుంబానికి సర్పంచ్ చిన్నపెద్దన్న సన్నిహితుడు
- మాజీ మంత్రి సూచనతో కేసును నీరుగారుస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం కప్పలబండ పంచాయతీలో సుమారు రూ. కోటి నిధులు గోల్‌మాల్ కావడంతో పంచాయతీ సర్పంచ్ చిన్నపెద్దన్న చెక్ పవర్‌ను అధికారులు రద్దు చేశారు. కప్పలబండకు చెందిన శేఖర్ అనే వ్యక్తి నిధుల దుర్వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలను బయటపెట్టడంతో పాటు ఎంపీడీఓ, డీపీఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణ చేపట్టి సర్పంచి చిన్నపెద్దన్నతో పాటు గంగాద్రి నాయక్, గోపాల్‌రెడ్డి, అజయ్ భాస్కర్‌రెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం విచారణ దశలో ఉంది. విషయం తెలిసిన వెంటనే డీపీఓ సమత సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు.

సర్పంచ దంపతుల ఖాతాకు నిధులు..

సర్పంచ్ చిన్నపెద్దన్న 15వ ఆర్థిక సంఘం నిధులు గోల్‌మాల్ చేశారు. ఇందులో సుమారు రూ.57 లక్షలు నిధులు దుర్వినియోగం జరిగినట్లు తెలిసింది. దీంతో పాటు సర్పంచ్ కాక ముందు చిన్న పెద్దన్న గ్రామంలో వాటర్‌మెన్‌గా చాలా కాలం పనిచేశారు. అన్నింటిపై అవగాహన ఉన్న చిన్నపెద్దన్న సర్పంచు అయిన తర్వాత తాగునీరు అందించే ఒక మోటర్ 36 సార్లు మరమ్మతుకు గురైనట్లు బిల్లులు చేశారని, పైప్‌లైను వేయకుండానే వేసినట్లు, కేవలం గేట్ వాల్వ్‌లకు వేలాది రూపాయలు ఖర్చు చేసినట్లు, గ్రామానికి వాటర్ సప్లయ్ చేసినట్లు, ఒక్కో బిల్లును రెండు, మూడేసి సార్లు చేసుకున్నట్లు ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు శేఖర్ చెప్పారు. నిధులన్నీ సర్పంచ్ దంపతుల ఖాతాలకు మళ్లించినట్లు తెలిసింది.



మంత్రి లోకేష్‌తో సర్పంచి చిన్నపెద్దన్న, మాజీ మంత్రి పల్లెతో సర్పంచి దంపతులు (ఫైల్)

మంత్రి లోకేష్, మాజీ మంత్రి పల్లెకు సన్నిహితుడు

సర్పంచి చిన్నపెద్దన్న విద్యాశాఖ మంత్రి లోకేష్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి సన్నిహితుడు. గ్రామంలోని ఓ టీడీపీ నాయకుడు గత ప్రభుత్వ హయాంలో బోరు, మోటర్, పైప్‌లైనుకు సుమారు రూ.4.5 లక్షలు ఖర్చు చేశారు. అయితే అతనికి తెలియకుండా సదరు బిల్లును సర్పంచి బిల్లు చేసుకోవడంతో కూటమి నాయకుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. పంచాయితీ మాజీ మంత్రి వద్దకు చేరడంతో అందరినీ పిలిపించి బిల్లు సెటిల్ చేయాలని సూచించారు. అయితే బిల్లు చెల్లించకపోవడంతో నిధుల దుర్వినియోగం బయటకు వచ్చింది. ఈ వ్యవహారంలో తలదూర్చవద్దని కొద్దిరోజుల్లో సర్పంచి పదవీ కాలం పూర్తవుతుందని, సర్పంచ్, సిబ్బందిపై చర్యలు తీసుకోవద్దని మాజీ మంత్రి అధికారులకు సూచించినట్లు తెలిసింది.

దాడి కేసులో వడ్డీ వ్యాపారి అరెస్టు

ధర్మవరం అర్బన్: అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ దాడులు, బెదిరింపులకు దిగిన ప్రధాన నిందితుడు సాకే రాజశేఖర్ అలియాస్ యర్రగుంట రాజాను అరెస్టు చేశామని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం రాజశేఖర్ అరెస్టు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. లక్ష్మీచెన్నకేశవ పురానికి చెందిన సాకే రాజశేఖర్ ధర్మవరం పట్టణం పరిసర ప్రాంతాల్లో అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ వడ్డీ చెల్లించని వారిని అనుచరులతో కలిసి బెదిరించడం, దాడులు చేయించడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటివి చేస్తున్నారన్నారు. జూలై 23న శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రమణ, అతని భార్య భారతిపై ఎర్రగుంట రాజా తన అనుచరులతో దాడి చేసి రూ.7 వేల నగదు తీసుకెళ్లారన్నారు. బాధితురాలు భారతి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి దరాప్తు చేశామన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. పరారీలో ఉన్న రాజాను పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అరెస్టు చేశామని తెలిపారు. అతని వద్ద నుంచి మొబైల్ ఫోన్‌తో పాటు రూ.కోటి విలువ చేసే భూసంబంధిత రిజిస్ట్రేషన్ పత్రం, రూ.10 లక్షలు విలువ చేసే రెండు ప్రామిసరీ నోట్లు, రూ.2700 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజశేఖర్‌పై ఇప్పటికే పలు మర్డర్ కేసులు, వడ్డీ వ్యాపార దాడుల కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.



వడ్డీ వ్యాపారిని అరెస్టు చూపుతున్న పోలీసులు

ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: ఉపాధి పనుల్లో అవకతవకలపై 'ఉపాధిలో మాయాజాలం' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మస్టర్లలో మాయాజాలంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉపాధి అవకతవకలపై సమగ్రంగా దర్యాప్తు చేస్తామన్నారు. సాక్షి కథనంలో పేర్కొన్న వివరాల మేరకు సదరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఏపీఓకు మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన వివరణను కలెక్టర్‌కు అందించనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి మత్తు .. బతుకు చిత్తు !

- కదిరి మండలం కాళసముద్రంలో ఇటీవల కొందరు మైనర్లు తోటి పిల్లలపై గంజాయి మత్తులో చెప్పులు, కర్రలతో దాడి చేసి ఆ దృశ్యాలను వారే సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ సంఘటనపై ఎస్పీ వి.రత్న ఆ గ్రామాన్ని సందర్శిస్తే పోలీసుల మెతక వైఖరి కారణంగానే ఇలా జరుగుతోందంటూ ఆమెపై బాధిత కుటుంబ సభ్యులతో పాటు మరికొందరు ఆగ్రహించిన విషయం తెలిసిందే.
- ఈ ఏడాది జనవరిలో ఎన్పీ కుంట మండలంలో గంజాయి అమ్ముతున్న తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుండి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని స్వయంగా కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే.
- తాజాగా కదిరి రూరల్ పోలీసులు కొండమనాయునిపాళ్యం వద్ద వాహనంలో గంజాయి తరలిస్తున్న గంజాయి ముఠాను అదుపులోకి తీసుకొని వారి నుండి సుమారు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

- యువతే లక్ష్యంగా జిల్లాలో జోరుగా విక్రయాలు
- అధికార అండతో రెచ్చిపోతున్న గంజాయి ముఠా
- ప్రయాణికుల ముసుగులో సరుకు తరలింపు

కదిరి: జిల్లాలో ఏడాదిగా గంజాయి దందా గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి ముఠా సభ్యులు విక్రయాలు సాగిస్తున్నారు. పోలీసులకు దొరక్కుండా పట్టణాలు మొదలు గ్రామాల్లో సైతం అమ్మకాలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి ముఠా సభ్యులకు కొండంత రాజకీయ అండ దొరికింది. దీంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

గుట్టు చప్పుడు కాకుండా..

కోస్తాలోని పలు ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుండి కూడా జిల్లాకు గంజాయి గుట్టుగా తరలి వస్తోంది. ఇందు కోసం గంజాయి ముఠా సభ్యులు కొందరు నిరుపేదలను ఎంపిక చేసుకొని వారికి



కమీషన్ రూపంలో చెల్లిస్తున్నారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. ప్రయాణికుల్లాగా వీరు బస్సులు, రైళ్లలో సరుకు తీసుకొచ్చి గంజాయి ముఠాకు అప్పగిస్తున్నారు. పోలీసుల తనిఖీల్లో గంజాయిని తీసుకొస్తున్న వారు దొరికినా సరఫరాదారులు, విక్రయదారులు మాత్రం అధికార పార్టీ నేతల అండతో తప్పించుకుంటున్నారు. గంజాయిని అరికట్టడం తమకు పెద్ద సమస్య కాదని, అసాంఘిక శక్తులకు అధికార పార్టీ నేతలు సహకరించకపోతే సంతోషిస్తామని జిల్లాకు చెందిన ఓ పోలీస్ అధికారి తెలిపారు. ఇటీవల తలుపుల మండలంలో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన ఒక దొంగను వదిలేయమని ఒక ప్రజాప్రతినిధి ఫోన్ చేసి చెప్పిన విషయాన్ని మరో పోలీస్ అధికారి గుర్తు చేశారు.

ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే ..

హిందూపురం, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల్లోని పలు విద్యాసంస్థల వద్ద విద్యార్థులకు గంజాయి అమ్ముతున్నారు. మత్తుకు అలవాటు పడ్డ కొందరు విద్యార్థులు గంజాయి కొనుక్కోవడానికి ఇంట్లో డబ్బులు ఇవ్వకపోతే ఇంట్లో వారిపై దాడులకు కూడా పాల్పడిన సంఘటనలు ఉన్నాయని కదిరికి చెందిన ఓ విద్యార్థి తెలిపారు. కొన్ని చోట్ల యువకులు బృందాలుగా ఏర్పడి డబ్బులకోసం ఎంతకైనా తెగిస్తున్నారు.

నాడీవ్యవస్థ పనితీరు మందగిస్తుంది



గంజాయి, హెరాయిన్, ఫోర్ట్‌విన్ ఇంజెక్షన్‌లు, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలను తీసుకుంటే నాడీ వ్యవస్థ పనితీరు మందగిస్తుంది. కండరాలు, నరాల బలహీనత, జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది, అసహనం, కుంగుబాటు, బరువు తగ్గిపోవడం వంటి రుగ్మతల బారిన పడతారు.

– మదన్‌కుమార్, వైద్యనిపుణులు, కదిరి

ప్రత్యేక టీములు ఏర్పాటు చేశాం



గంజాయితో పాటు ఇంకా ఇతర మాదక ద్రవ్యాల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇందుకోసం ప్రత్యేక టీములు ఏర్పాటు చేశాం. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా కౌన్సిలింగ్ ఇస్తున్నాం. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల కదలికలు, అలవాట్లపై ఓ కన్నేసి ఉంచాలి. – వి.రత్న, జిల్లా ఎస్పీ

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీకి ఎంపిక



వరుణ్ సందేశ్‌ను అభినందిస్తున్న దృశ్యం

రొళ్ల: మండలంలోని దొమ్మరహట్టిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి వరుణ్‌సందేశ్, హర్షవర్ధన్, మనోహర్ త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే క్రికెట్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నారు. బుధవారం అనంతపురంలోని పీటీసీలో జరిగిన పోటీల్లో మెరుగైన ప్రతిభతో వారు ఆకట్టుకున్నారని గురువారం సాయంత్రం ఆ పాఠశాల పీఈటీ చంద్రశేఖర్ తెలిపారు. బెస్ట్ బౌలర్‌గా హర్షవర్ధన్, బెస్ట్ బ్యాటర్‌గా మనోహర్, ఆల్ రౌండర్ ప్రతిభతో వరుణ్‌సందేష్ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను గురువారం పలువురు అభినందించారు. సాయంత్రం పాఠశాల ఆవరణలో క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ సుమ, ప్రిన్సిపాల్ మైలారప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వలస కార్మికుడి మృతి



మృతుడు మోనాపత్ర్

పరిగి: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఒడిశాలోని గంజామ్ జిల్లా కుడియా గ్రామానికి చెందిన మోనాపత్ర్(45)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారం రోజుల క్రితం పరిగి మండలంలోని మోదా వద్ద ఉన్న మహర్షి ఐరన్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిలో చేరాడు. అదే పరిశ్రమలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న తన ప్రాంతానికి చెందిన అశోక్‌కుమార్ బిషోరీతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. బుధవారం రాత్రి కర్మాగారంలో పని ముగించుకుని స్నేహితులిద్దరూ మోదా గేట్ వద్దకెళ్లి చికెన్ కొనుగోలు చేసుకుని తమ గదికి నడుచుకుంటూ వెళుతుండగా కర్ణాటక వైపు నుంచి వేగంగా ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చిన హిందూపురానికి చెందిన జాబీద్ వెనుక నుంచి మోనాపత్ర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమైన అతన్ని వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'పీఓపీ'పైనే ఆసక్తి!

'ఏటా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ఇందు కోసం రూ. లక్షలు ఖర్చు పెడుతున్నాం. ఇదంతా లోక కల్యాణం కోసమే చేస్తున్నాం' అంటూ ఏ ఉత్సవ సమితిని అడిగినా ఠక్కున వచ్చే సమాధానం ఇదే. ఇదంతా నాణేనికి ఒక వైపు. మరో వైపు ఉత్సవాల నిర్వహణలో అనుసరిస్తున్న విధానంలో ఎక్కడేగాని పర్యావరణ హితం కనిపించడంలేదు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే ప్రతిమలు, వాటికి వాడే రసాయనిక రంగుల వల్ల నీటి వనరులు కలుషితం అవుతున్నాయన్న పర్యావరణ వేత్తల ఆందోళన పెడచెవిన పెడుతున్నారు. మరో ఆరు రోజుల్లో గణేష్ ఉత్సవాలు ముంచుకొస్తున్న తరుణంలో ధర్మవరంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల తయారీ ఊపందుకుంది.

- 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం
- ధర్మవరంలో జోరుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీ
- మట్టి గణపయ్యలను పూజిద్దామంటూ పర్యావరణ వేత్తల పిలుపు



రంగుల అద్దకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు



వినాయక ప్రతిమలకు రంగులు వేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దాదాపు పది కుటుంబాలు నాలుగు నెలలుగా ధర్మవరంలోనే ఉంటూ వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. ధర్మవరం పట్టణంలో మొత్తం 40 వార్డులు ఉండగా ప్రతి వార్డులోనూ నాలుగైదు వినాయక విగ్రహాలు చొప్పున కొలువు దీర్చనున్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటలు, వంకలు, కాలువల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో వినాయక విగ్రహాలను కొలువుదీర్చే వారి సంఖ్య పెరిగింది. ఈ క్రమంలో విగ్రహాల తయారీలో పీఓపీ వైపే చాలా మంది మొగ్గు చూపుతున్నారు.

ఒకప్పుడు మట్టి విగ్రహాలే...

మట్టికి నీటిలో సులువుగా కరిగే గుణం ఉంటుంది. విగ్రహాల తయారీలో చెరువు మట్టి వినియోగంతో పూడిక సమస్యలూ తొలగుతాయి. అందుకే మట్టితో చేసిన గణపతులకు పూర్వీకులు ప్రాధాన్యతనిచ్చేవారు. అంతేకాక 18 రకాల పత్రులతో మట్టి విగ్రహాన్ని పూజించి నిమజ్జనం చేసేవారు. ఆధునిక వైద్యం అందుబాటులో లేని ఆ రోజుల్లో వర్షాకాలంలో వరదల తరువాత జరిగే నీటి కాలుష్యాన్ని నివారించేందుకు ఈ 18 రకాల పత్రులు దోహదపడేవి.

నేడు రసాయనాల కలబోత...

నేడు వినాయక చవితి ఉత్సవాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. పీఓపీకి నీటిలో గుణం లేదు. ఈ ప్రతిమ తయారీలో వినియోగించే జిప్సం, గంధకం, మెగ్నిషియం, పాదరసం, సీసం, కాడ్మియం, కార్బన్ తదితర అవశేషాలతో అనర్థాలు పొంచి ఉన్నాయని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ విగ్రహాలను నిమజ్జనం చేసిన తర్వాత ఆ నీరు కలుషితమవుతోందని అంటున్నారు.

దృష్టి సారించని అధికారులు..

కాలుష్యాన్ని నివారించేందుకు 2010లో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని జిల్లాలో అమలు చేయాల్సిన అధికారులు బేఖాతరు చేస్తున్నారు. పర్యావరణ హితానికి పనికొచ్చే కార్యక్రమాలను చేపట్టడంలో పూర్తిగా విఫలయ్యారు. కాలుష్య నియంత్రణ, మున్సిపాలిటీ, మత్స్య, నీటి పారుదల శాఖలు నిస్తేజంగా వ్యవహరించడంతో ఏటా జిల్లాలో పీఓపీతో చేసిన 30 వేల నుంచి 35 వేల వినాయక ప్రతిమలు నిమజ్జనమవుతున్నాయి. ఫలితంగా జల కాలుష్యం పెరిగి జలచరాలు, మానవాళి మనుగడ ప్రమాదకరంగా మారుతోంది.

ట్రెండ్‌కు అనుగుణంగా తయారీ

నూతన డిజైన్లతో ఉత్సవ సమితి నిర్వాహకులు వస్తున్నారు. భారీ విగ్రహాలు కూడా బరువు తక్కువగా ఉండాలని కోరుకుంటున్నారు. మట్టితో చేసిన విగ్రహాలు బరువు ఎక్కువగా ఉంటాయి. దీంతో పీఓపీ విగ్రహాల వైపు వారు మొగ్గు చూపుతున్నారు. దీంతో అత్యధిక శాతం సుద్ధపిండిని కలిపి వాడుతున్నాం. ఇది నీటిలో త్వరగా కరిగేందుకు దోహదపడుతుంది. నీరు కలుషితం కాదు. పర్యావరణానికి హాని కలిగించని రంగులనే వాడుతున్నాం. ఎలాంటి విషపూరిత రసాయనాలు వాడడం లేదు. అన్ని జాగ్రత్తలు తీసుకుని ఉత్సవ సమితి నిర్వాహకుల కోరిక మేరకు విగ్రహాలను తయారు చేస్తున్నాం.

– రామాంజనేయులు, వినాయక బొమ్మల తయారీదారుడు, ధర్మవరం

పీఓపీ వద్దు



పీఓపీతో చేసే విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడం వల్ల ప్రాణికోటికి విఘాతం కలుగుతుంది. విగ్రహాలకు వాడే రంగుల్లో హానికరమైన రసాయనాలుంటాయి. ఫలితంగా చర్మ వ్యాధులు సంక్రమిస్తాయి. మట్టి విగ్రహాలయితే ఎలాంటి హానీ ఉండదు. అందులోనూ సహజ రంగులు వాడితే ప్రమాదం ఉండదు. అందరూ విధిగా మట్టి విగ్రహాలను పూజించి మనల్ని మనం రక్షించుకుందాం.

– డాక్టర్ తిప్పేంద్రనాయక్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, ధర్మవరం

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



ఇండియా స్కిల్స్ కాంపిటీషన్స్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: గ్రామీణ మంత్రిత్వ శాఖ, కెనరా బ్యాంకు సహకారంతో ప్రారంభించిన స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కలెక్టర్ చేతన్ సూచించారు. గురువారం పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పురుషులకు మోటర్ సైకిల్ సర్వీసింగ్, సెల్ ఫోన్ రిపేరీ, ఫొటో, వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ వైరింగ్, పంప్‌సెట్ రిపేరీ, డ్రస్ డిజైనింగ్, ట్యాలీ నేర్పించనున్నట్లు చెప్పారు. స్త్రీలకు బ్యూటీపార్లర్, డ్రస్ డిజైనింగ్, పెళ్లి కూతురు మేకప్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ, మెహందీ, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, కొవ్వొత్తుల తయారీ, జర్దోసి వంటి వాటిపై శిక్షణ ఇస్తారన్నారు. భోజనం, వసతి సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. ఎల్‌డీఎం రమణకుమార్, కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, సీబీ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ శాంతిప్రియ, పరిశ్రమలశాఖ జీఎం నాగరాజు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

విద్యార్థుల ప్రతిభను వెలికితీసే పోటీలకు సంబంధించిన ఇండియా స్కిల్స్ కాంపిటీషన్స్ పోస్టర్లను బ్యాంకర్లతో కలిసి కలెక్టర్ చేతన్ ఆవిష్కరించారు. 18 నుండి 25 సంవత్సరాల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ నైపుణ్య పోటీలు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. 63 విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9988853335 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డిమాండ్‌కు సరిపడని యూరియా



పెదపల్లి సొసైటీలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

- వచ్చిన వెంటనే ఖాళీ అవుతున్న గోదాములు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా రైతుల డిమాండ్‌కు సరిపోవడం లేదు. ఒక లోడు, అర లోడు చొప్పున పంపుతుంటే కేవలం గంటల వ్యవధిలోనే ఖాళీ అవుతోంది. జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా మొక్కజొన్న, వరి సాగు చేపట్టారు. అయితే యూరియా డిమాండ్ ఉన్న ఈ పంటల్లో ప్రభుత్వం అరకొరగా సరఫరా చేస్తుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, సొసైటీల వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు క్యూ కడుతున్నారు. గురువారం పెదపల్లి సొసైటీకి 140 బస్తాల యూరియా రాగా, రెండు గంటల వ్యవధిలోనే ఖాళీ అయిపోయింది. ఒక్కో రైతుకు రెండేసి బస్తాలు చొప్పున పంపిణీ చేసినా క్యూ లైన్‌లో వేచి ఉన్నవారిలో సగం మందికి కూడా దక్కలేదు. దీంతో చాలా మంది రైతులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. ప్రస్తుతం జిల్లాలో 4,700 టన్నుల యూరియా ఉన్నట్లుగా వ్యవసాయ శాఖ చెబుతున్నా.. ఈ మొత్తం ఏనాడో ఖాళీ అయిపోయి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వచ్చే లోడు కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేయాల్సి వస్తోందన్నారు.

డిగ్రీ పాఠ్యాంశంగా డాక్టర్ ప్రగతి కవిత



డాక్టర్ ప్రగతి

హిందూపురం టౌన్/అనంతపురం ఎడ్యుకేషన్: హిందూపురం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి రాసిన కవిత డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశం కానుంది. ఈ మేరకు డిగ్రీ సిలబస్ కమిటీ చైర్మన్ సుంకర గోపాలయ్య గురువారం వివరాలనందించారు. అనంతపురానికి చెందిన డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ రచించిన 'మగ్గం బతుకు' అనే దీర్ఘ కవితను డిగ్రీలో స్పెషల్ తెలుగు చదువుకునే వారికి ఆరో సెమిస్టర్‌లో పాఠ్యాంశంగా చేర్చారు. అలాగే డాక్టర్ ప్రగతి రాసిన 'బొగ్గుల పొయ్యి' కవిత బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సెమిస్టర్‌లో జనరల్ తెలుగు చదువుకునే విద్యార్థులకు సిలబస్‌గా చేర్చారు. అనంత కవుల కవితలను డిగ్రీ విద్యార్థుల పాఠ్యాంశాలుగా చేర్చడంపై సాహితీ స్రవంతి, డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ ఫౌండేషన్, డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి, జిరసం, అరసం, తెలుగు వెలుగు సాహితీ సంస్థల ప్రతినిధులు, హిందూపురం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేశారు.

ఒకే ఈతలో రెండు దూడలు



పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లికి చెందిన మహిళా రైతు లక్ష్మీదేవి కుమారుడు రంగప్ప పెంచుతున్న పాడి ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఇందులో ఒకటి ఆడ, మరొకటి మగ దూడ ఉంది. రెండూ ఆరోగ్యంగా ఉన్నట్లు పశు వైద్యాధికారి తెలిపారు. విషయం తెలుసుకున్న రైతులు, స్థానికులు రంగప్ప ఇంటికి చేరుకుని దూడలను ఆసక్తిగా గమనించారు.

నేత్రపర్వంగా శ్రీవారి ఉంజల్ సేవ



దోలోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి ఉంజల్ సేవ గురువారం రాత్రి నేత్ర పర్వంగా నిర్వహించారు. శ్రావణ మాసం బహుళ పక్షం త్రయోదశి పుష్యమి నక్షత్రం సందర్భంగా ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో గురువారం రాత్రి భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరించి శ్రీరంగ మంటపంలో దోలోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

గుడిబండ/రొళ్ల: ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆర్థిక భారం తగ్గించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని బెంగళూరు కృషి విశ్వవిద్యాలయ (అగ్రికల్చర్ యూనివర్సిటీ) మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. డీపీఎం లక్ష్మానాయక్‌తో కలసి గురువారం గుడిబండ మండలం జవనడుకు, చిగతుర్పి, రొళ్ల మండలం కొరగార్లగుట్ట గ్రామాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన ఆకుకూరలు, కూరగాయలు, నవధాన్యాల సాగును పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై విత్తన గుళికలు, బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ నవీన్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హనుమంతరాయప్ప, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి ప్రాణభిక్ష పెట్టండి

- సక్రమంగా పని చేయని రెండు కిడ్నీలు
- బ్లడ్ ఇన్‌ఫెక్షన్, న్యూమోనియాతో కదలలేని స్థితి
- చికిత్స కోసం రూ.10 లక్షలు అవసరం
- దాతల కోసం ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబం



బెంగళూరులోని ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న చిన్నారి అల్ఫియా

నల్లచెరువు: మండలంలోని దేవిరెడ్డిపల్లికి చెందిన ఇమాంబాషా, షబానా దంపతుల నాలుగేళ్ల వయసున్న ఏకైక కుమార్తె అల్ఫియా ప్రాణాపాయ స్థితిలో బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటికే రూ. లక్షలు ఖర్చు కాగా, పాప సంపూర్ణ ఆరోగ్య వంతురాలు కావడానికి అవసరమైన చికిత్స కోసం రూ.10 లక్షలు అవుతుందని అక్కడి డాక్టర్లు పేర్కొన్నారు. దీంతో నిరుపేద కుటుంబానికి దిక్కుతోచడం లేదు. ఆపన్న హస్తం అందించి తమ కుమార్తెకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.

20 రోజుల క్రితం న్యూమోనియా..

అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని గ్యాస్ ఏజెన్సీలో డెలవరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని ఇమాంబాషా పోషించుకుంటున్నాడు. జీవనం సాఫీగా సాగిపోతున్న తరుణంలో 20 రోజుల క్రితం అల్ఫియాకు జబ్బు చేసింది. తీవ్రమైన జ్వరం, దగ్గు ఎక్కువగా ఉండడంతో మదనపల్లిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పది రోజులు గడిచాయి. అయినా చిన్నారికి నయం కాకపోవడంతో మరోసారి వైద్య పరీక్షించి న్యూమోనియాతో బాధపడుతున్నట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తెలిసిన వారి వద్ద అప్పు చేసి డబ్బు సమకూర్చుకుని ఆగమేఘాలపై బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి చిన్నారిని తీసుకెళ్లారు.

సక్రమంగా పనిచేయని కిడ్నీలు..

అల్ఫియాకు వైద్య పరీక్షలు నిర్వహించిన బెంగళూరులోని ఆస్పత్రి వైద్యులు.. న్యూమోనియాతో పాటు బ్లడ్ ఇన్‌ఫెక్షన్ తీవ్రంగా ఉన్నట్లుగా గుర్తించారు. ఈ క్రమంలోనే రెండు కిడ్నీలూ సక్రమంగా పనిచేయడం లేదని నిర్ధారించారు. అల్ఫియా పరిస్థితి విషమంగా ఉండడంతో సత్వర చికిత్సలు అందించాలని పాప పూర్తిగా కోలుకోవాలంటే రూ.10 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. పిడుగు లాంటి వార్త విన్న నిరుపేద తల్లిదండ్రులకు ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో చిన్నారి వైద్య ఖర్చులు మొత్తం భరించాల్సి వస్తోంది. ఇప్పటికే తెలిసిన వారి వద్ద చేసిన రూ. 4 లక్షల వరకూ అప్పు చేసి చికిత్స చేయించారు. అయినా పాప పరిస్థితిలో మార్పు లేకపోవడంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. అక్కడి ఐసీయూలో చికిత్స పొందుతున్న చిన్నారికి ప్రాణభిక్ష పెట్టే దాతలు ఎవరైనా ముందుకు రావాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

సాయం చేయదలిస్తే..

పేరు	: ఎస్.షబానా
బ్యాంకు పేరు	: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు
ఖాతా నంబర్	: 9115 0793 384
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్	: ఏపీజీబీ0001047
ఫోన్‌పే నంబర్	: 93915 74457

ఖాద్రీ ఆలయంలో నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పేర్లు నమోదు చేయించుకున్న భక్తులందరూ ఉదయం 10 గంటల కంతా ఆలయానికి చేరుకోవాలన్నారు. వ్రతానికి కావలసిన వస్తువులన్నీ ఆలయ అధికారులే అందజేస్తారు. వ్రతానికి వచ్చే మహిళలు కలశం వెంట తీసుకురావాలని సూచించారు.

యువకుడి హత్య



ధనుంజయ (ఫైల్)

ధర్మవరం అర్బన్: స్థానిక ఎల్‌పీ సర్కిల్‌లోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఓ యువకుడిని దుండగులు దారుణంగా హతమార్చారు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడిని ఎల్–3 కేతిరెడ్డి కాలనీకి చెందిన పాళ్యం ధనుంజయ(26)గా గుర్తించారు. భార్య శ్రుతి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బైక్ మెకానిక్‌గా కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ కలహాలతో భార్య గొడవ పడి కొంత కాలం క్రితం బళ్లారిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ధనుంజయ తన తల్లిదండ్రుల వద్దనే నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద వ్యాయామం చేసుకునే స్థలంలో ధనుంజయ తలపై ఓ దుండగుడు సిమెంట్ ఇటుక వేసి హతమార్చాడు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. హతుడి తల్లి లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైతు బలవన్మరణం

అమరాపురం: మండలంలోని నగోనపల్లికి చెందిన రైతు గొల్ల కృష్ణప్ప (59) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గొల్ల కృష్ణప్పకు భార్య సవీరమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలిద్దరికీ పెళ్లిళ్లు చేశారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల క్రితం కృష్ణప్ప వెను నొప్పితో బాధపడుతున్నాడు. దావణగెర, తుమకూరు, బెంగళూరు, పావగడ, అమరాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. తరచూ నొప్పికి తాళలేక విలవిల్లాడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన గురువారం తన పొలం పక్కనే ఉన్న తుగ్గలి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సవీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రిమాండ్‌కు రౌడీ షీటర్ పవన్

కదిరి టౌన్: రెండు రోజుల క్రితం సాయికిషోర్ అనే యువకుడిపై హత్యాయత్నం చేసిన కేసులో పరారీలో ఉన్న రౌడీ షీటర్ పవన్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలు గురువారం సీఐ నారాయణరెడ్డి వెల్లడించారు. అందిన పక్కా సమాచారంతో బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లిలో పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, గురువారం న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న శివ, సాయికుమార్, కళ్యాణ్ పరారీలో ఉన్నారన్నారు. వీరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

భార్యకు అవమానం.. భర్త ఆత్మహత్య

వజ్రకరూరు: తన భార్యకు జరిగిన అవమానాన్ని తాళలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వజ్రకరూరు మండలం తట్రకల్లు గ్రామానికి చెందిన బాలతిమ్మరాజు (40)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం సాయంత్రం కాయగూరలను ఫ్రిజ్‌లో పెట్టేందుకు భార్య పక్కింటికి వెళ్లింది. ఆ సమయంలో పక్కింటి యజమాని కురుబ నాగార్జున ఆమెను బలత్కారం చేయబోయాడు. ప్రతిఘటించి ఇంటికి చేరుకున్న భార్య జరిగిన విషయాన్ని భర్తకు తెలపడంతో బాలతిమ్మరాజు నేరుగా వెళ్లి నిలదీశాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చెలరేగి విషయం గ్రామంలో అందరికీ తెలిసిపోయింది. దీంతో గ్రామంలో పరువు పోయిందనే మనోవేదనతో తిమ్మరాజు బుధవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక గురువారం బాలతిమ్మరాజు మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురుబ నాగార్జునతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

కదిరి టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలను రూ.26 వేలకు పెంచాలని ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. కదిరి ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన అంగన్‌వాడీ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. అనంతరం కదిరి ప్రాజెక్ట్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా ప్రమీలమ్మ, కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా ఎలిజబెత్ రాణిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాబున్నీషా, శ్రీదేవి, సీఐటియూ నాయకులు జగన్‌మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.